నేటి నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం


మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం


తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఆర్వో ప్రమీలాగాంధీ

నాతవరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకూ బూత్ స్థాయిలో ఇంటింట ఓటరు సర్వే చేపట్టాలని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం బీఎల్వోలను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. తర్వాత బీఎల్వోలతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్‌కు 1,500 మంది లోబడి ఓటర్లు ఉండాలన్నారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు దివ్యాంగులు, వందేళ్లు పైబడిన ఓటర్లను గుర్తించాలన్నారు. వీరికి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా వసతి ఏర్పాట్లు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల లోపు ఏ రాజకీయ పార్టీ కార్యాలయాలు ఉండకూదన్నారు. నర్సీపట్నం అసెంబ్లీ పరిధిలోని పలు మండలాల్లో ఒకే ఇంట్లో పది మందికి పైగా ఓటర్లు ఉన్నట్లుగా 280 ఇళ్లు గుర్తించామన్నారు. ఆయా ఇంటికి వెళ్లి ఉమ్మడి కుటుంబమా.. లేదా? స్వయంగా పరిశీలించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరించే బూత్ లెవెల్ అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్న భూ రీసర్వే వేగవంతం చేయండి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భూ రీసర్వే వేగవంతం చేయాలని ఆర్డీవో జయరాం ఆదేశించారు. ఇంతవరకు సర్వే చేసిన రెవెన్యూ గ్రామాల్లో జగనన్న రాళ్ల సరిహద్దులో ఏర్పాటు చేయాలన్నారు. సర్వే సమయంలో రైతుల సందేహాలు నివృత్తి చేయాలన్నారు. అవకతవకలు లేకుండా బాధ్యతగా సర్వే చేస్తే ఎలాంటి సమస్య ఉండదన్నారు. తహసీల్దార్ ఎస్. ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టరు వెంకటరమణ, ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్లు చైన్లు, నరేంద్ర, మండల సర్వేయరు బాలరెడ్డి పాల్గొన్నారు.

- **బీఎల్వోలతో ఆర్వో ప్రమీలాగాంధీ సమీక్ష**

రావికమతం: గ్రామాల్లో మృతులు, డబుల్ ఎంట్రీ ఉన్న వివరాలను బీఎల్వోలకు ఇచ్చి సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బూత్ స్థాయి అధికారులతో గురువారం ఆమె సమీక్షించారు. ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి ఓటరు కార్డు ఆధార్‌తో అనుసంధానమైందా లేదా తెలుసుకోవాలన్నారు. ఓటరు వివరాలు పక్కాగా ఉన్నాయా, మృతులెవ్వరైనా ఉన్నారా, లేదా పరిశీలించి జాబితాను తయారు చేయాలని సూచించారు. సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. తహసీల్దార్ మహేశ్వరరావు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

- **18 ఏళ్లు నిండితే ఓటుహక్కు**

మాడుగుల రూరల్: తహసీల్దారు పి.వి.రత్నం తన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. వలసదారులు తమ స్థిర నివాసం ఉన్న ప్రాంతంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఓటు గుర్తింపు కార్డు అందజేస్తామన్నారు. బీఎల్వోలు, డీటీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు


దొర్లసురవరంలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా సాగరం పంచాయతీ శివారు దొర్లసురవరంలో సర్పంచ్ కోట్ని జయమ్మా సన్యాసినాయుడు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం ఇక్కడ మురుగు కాలువల్లో పూడిక తీయించారు. రోడ్ల మీద చెత్తా చెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

గొలుగొండ: జోగుంపేట, గొలుగొండ పంచాయతీల్లో నిరుపేదలకు స్నేహాంజలి ఫర్ పూర్ సంస్థ ప్రతినిధులు నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. 50 మంది పేదలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు చిట్టియ్య, బోగేష్, ప్రసాద్, బాను, నల్లయ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నుంచి ప్రతీ గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు అందిస్తున్నామని తెలిపారు. పేదలను ఆదుకోవడమే తమ సంస్థ ధ్యేయం అన్నారు.

భారీ వర్షంతో ఇబ్బందులు


ఏఎల్‌పురం బస్సు స్టేషన్ వద్ద నిలిచిన వర్షం నీరు


గొలుగొండ: మండలంలో గురువారం తెల్లవారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురవడంతో పొలాల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాల వీధుల్లో నీరు నిలిచిపోయింది. ఏఎల్‌పురం బస్సు స్టేషన్ వద్ద వర్షం నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారగెడ్డ, బోరింగ్ గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహించింది. ఈ వర్షంతో నాలుగు రోజుల్లో వరి నాట్లు వేసేందుకు మండల రైతులు దమ్ములకు సిద్ధమవుతున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: ఎం. కోడూరు జిల్లా పరిషత్ హైస్కూలు ముందు భాగంలో సీసీరోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలతో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో 250 మీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు చేపట్టినట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు తెలిపారు. ఆర్అండ్‌బీ రహదారి నుంచి పాఠశాల ముందు భాగం వరకు రహదారి సౌకర్యం మెరుగుపడటంతో హెచ్ఎం, పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గురుకులానికి ఎల్ఈడీ బల్బుల వితరణ


ప్రిన్సిపాల్‌కు విద్యుత్ బల్బులను అందజేస్తున్న చైర్మన్ ఉల్లి శ్రీను

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి స్థానిక స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను విద్యుత్ బల్బులను వితరణ చేశారు. రూ.10 వేలు విలువ చేసే 30 ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, ఐదు ఎల్ఈడీ బల్బులను తన సొంత సొమ్ముతో కొనుగోలు చేసి గురుకుల ప్రిన్సిపాల్ కె.వి.ఎల్. నర్సింహరావుకు గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతను ప్రిన్సిపాల్ తోపాటు పూర్వ ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ


గుల్లేపల్లిలో అవగాహనా ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలంతా జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం గుల్లేపల్లిలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజులపాటు నిల్వ నీటిని ఉంచకుండా ప్రతీ ఫ్రై డేను డ్రైడేగా పాటించాలని సూచించారు. మురుగులో లార్వాను విడలడం వల్ల దోమల వృద్ధి ఎక్కువయ్యే పరిస్థితు ఉన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవికుమార్, డీఎస్ఎస్ రాజు, సన్యాసమ్మ, పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎందరికో మేలు


జానకీరాంపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రమణ


బుచ్చెయ్యపేట: లోపూడిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీడీవో,నాయకులు

రోలుగుంట: జానకీరాంపురంలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు , శరబవరంలో తహసీల్దార్ కె.వరహాలు బృందాలతో గురువారం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. జానకీపురంలో సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, ఎంపీడీవో, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణలతో కలసి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రమణ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, జగనన్న సురక్ష శిబిరంలో అక్కడికక్కడే ధ్రువపత్రాలు అందించడం ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. శరభవరంలో వైస్ ఎంపీపీ-2 దోసపత్ని వరలక్ష్మి, రాజు, పంచాడ చినరాయుడులతో కలిసి తహసీల్దార్ ధ్రువపత్రాలు అందజేశారు.

బుచ్చెయ్యపేట: ఇంటి వద్దకు ఉచితంగా కుల, ఆదాయ, జనన, మరణ తదితర సర్టిఫికెట్లను ఉచితంగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు తెలిపారు. గురువారం రెండు సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. లోపూడిలో 964 మందికి, దిబ్బిడిలో 1,008 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో వీటిని పొందాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా శ్రేయస్సు కోరి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వలంటీర్ల ద్వారా వివరాలు సేకరించి అర్హతే ప్రామాణికంగా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ఇంటికే అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలన తీరును, ప్రస్తుతం ప్రభుత్వ విధానాన్ని ప్రజలు గ్రహించి మరలా పట్టం కట్టాలని కోరారు. సర్పంచ్‌లు మేరుగు కుమారి బాబారావు, పెదిరెడ్ల మాణిక్యం, తమరాన శ్రీనివాసరావు, వేపాడ మనీషా, సచివాలయ కన్వీనర్లు యెనుముల వాసు, తమరాన రమణ, రేణం సోమునాయుడు, గుడాల ఆనంద్, వేపాడ మధు, రేణం బాలకృష్ణ, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, వీఆర్వో సుధాకర్, ఈవో లవరాజు, పీఎస్‌లు సతీష్, వినయ్, సాయికృష్ణ, కామాక్షి, సెహనాజ్, హర్ష, శేఖర్, పుష్పావతి పాల్గొన్నారు.

కోలా గురువులుకు అభినందన


కోలా గురువులు, ధర్మశ్రీలకు శాలువాలు కప్పుతున్న సర్పంచ్

చోడవరం రూరల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులును బెన్నవోలు గ్రామ సర్పంచ్ మాడెడ్ల శంకరరావు అభినందించారు. గురువారం ముద్దుర్తి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా కోలాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ మహాలక్ష్మి తరపున ఆయనతోపాటు విప్ ధర్మశ్రీకి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. చోడవరం ఎంపీపీ గాడి కాసు, బెన్నవోలు సచివాలయ కన్వీనర్ ఎం.సుధీర్ పాల్గొన్నారు.

రోడ్లపై విమర్శలు హాస్యాస్పదం

- మాడుగుల మండలాభివృద్ధిపై చర్చకు సిద్ధమా?
- మాజీ ఎమ్మెల్యే రామానాయుడికి వైస్ ఎంపీపీ రాజారామ్ సవాల్


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో ఘాట్‌రోడ్ వయా జేడీపేట కింతలి రోడ్డు మరమ్మతులు మూడు రోజులుగా చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. గురువారం సాయంత్రం ఘాట్‌రోడ్, కింతలి రోడ్డు వద్ద వైస్ ఎంపీపీ మాట్లాడారు. ఒకవైపు పనులు చేస్తున్న రోడ్డులో జంపెన వద్ద గోతిలో చేరిన వర్షపు నీటిలో చేపలు పట్టినట్టు నటిస్తే, ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోల్పోయిన వ్యక్తి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తుంటే కనిపించలేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రోడ్లపైకి వస్తే చెప్పులు విసిరి కొట్టాలని రెచ్చగొట్టడం ఈ ప్రాంత సంస్కృతి కాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని, లేదంటే తగిన గుణపాఠం ప్రజలే చెబుతారని హెచ్చరించారు. రూ.1.60 కోట్లతో ఎం.కోడూరు నుంచి ఖండివరం వరకు రోడ్డు, రూ.20 లక్షలతో ఘాట్‌రోడ్ నుంచి మాడుగుల వరకు మరమ్మతులు, రూ.1.10 కోట్లతో వద్దాది నుంచి గాదిరాయి వరకు, రూ.50 లక్షలతో జేడీపేట, కింతలి రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు, రూ.9.10 కోట్లతో గొటివాడ నుంచి రాంజంపేట వరకు, మాడుగుల దేవి ఆలయం నుంచి తాచేరుపై వంతెన తోపాటు పాడేరు రోడ్డు వరకు రూ. 8 కోట్లు మంజూరు, శీతబందల, సారాడ, తదితర గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తే కళ్లున్న కబోదులా విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. వీటిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, జంపెన, జేడీపేట, సర్పంచ్‌లు నేమాల గురువునాయుడు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొద్దపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు, సోమన్నదొర, మొల్లి అప్పారావు, పప్రే రామునాయుడు, బన్నీ, కాత రమణ పాల్గొన్నారు.

నేడు అడవిల అగ్రహారంలో 'గడప గడపకు'

చీడికాడ: అడవిల అగ్రహారంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారన్నారు. ఉదయం 7 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, పాల సొసైటీ అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.

'చెరకు బకాయిలు వెంటనే చెల్లించాలి'

చోడవరం: చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీ చెరకు రైతుల సంఘం ఆధ్వర్యంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద గురువారం రైతులు నిరసన తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఫ్యాక్టరీ ఎండీ వి.వి. సన్యాసినాయుడికి అందజేశారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించాని, జిల్లాలో మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది చెరకు మద్దతు ధర టన్నుకు రూ.5 వేలు ఇవ్వాలని, గత తేడాది చెరకు బకాయిలు 15 రోజుల్లోగా చెల్లించాలని కోరారు. ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, కోశాధికారి గండి నాయుడుబాబు పాల్గొన్నారు.

ఇసుక డిపో వద్ద నిరసన

నర్సీపట్నం: డబ్బులు కట్టి ఇసుక కోసం రోజుల తరబడి తిప్పుతుండటంతో గురువారం జగనన్న ఇళ్ల లబ్ధిదారులు గబ్బాడ ఇసుక డిపో వద్ద నిరసన చేపట్టారు. నాలుగు మండలాలకు చెందిన జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఈ డిపో నుంచే ఇసుక సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణం నుంచి ఇసుకకు డబ్బులు కట్ చేసి హౌసింగ్ అధికారులు రసీదులు ఇస్తున్నా, డిపోలో ఇసుక ఇవ్వటం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక ఇవ్వకపోతే తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిపో నిర్వాహకులను నిలదీశారు. దీంతో అక్కడ కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

శత శాతం ఇళ్ల నిర్మాణం లక్ష్యం


సూచనలు చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు డిసెంబరులోగా శత శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో గురువారం హౌసింగ్ జేఈ జోగారావుతో కలిసి సమీక్షించారు. మండలంలో 2,032 ఇళ్లు మంజూరు కాగా, ఇంతవరకు 400 పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మరో 900పైగా వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇవి కాకుండా మరలా ప్రభుత్వం 400 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఆయా లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్లులు జమ చేస్తామన్నారు.

మణిపూర్ ఘటనపై దళిత సంఘాల నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు చిట్ల చలపతిరావు పేర్కొన్నారు. ఘటనను నిరసిస్తూ గురువారం స్థానిక అబిద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు లేని కారణంగా ఎత్తివేసిన హాస్టళ్లను అంబేడ్కర్ గ్రంథాలయాలుగా మార్పు చేయాలన్నారు. సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ, ఎస్టీ వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలన్నారు. డీవీఎంసీ సభ్యుడు ఎం.అప్పలరాజు, మాలమహానాడు అధ్యక్షులు జి.సహాదేవుడు, యాదిగిరి దాసు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బోటనీ కోర్సు

గడపగడపలో ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


ప్రజల సమస్యలను స్వయంగా నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్


పార్టీ గుర్తు గొడుగులతో గడపగడపలో ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ.. జోరు వర్షంలోనూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముందుకు సాగారు. మున్సిపాలిటీ 11వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం ఆయన ఇంటింటికీ తిరిగారు. ప్రజలు చెప్పిన సమస్యలను తానే స్వయం రాసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, అర్బన్ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మున్సిపాలిటీలో రూ.1.60 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు, గొలుగొండ మండలం చీడిగుమ్మలలో రూ.2.10 కోట్లతో పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిలో రూ.9 కోట్లతో అదనపు భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బోటనీ కోర్సుకు అనుమతులు వచ్చాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, బేతిరెడ్డి విజయ్, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, అర్జున్, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బయపురెడ్డి చినబాబు, మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఎండీ బాషా, ఏఎంసీ డైరెక్టర్ లోకవరపు శారద, యూత్ అధ్యక్షుడు ధనిమరెడ్డి నాగు, పార్టీ నాయకులు యాదిగిరి శేషు, కణితి అన్నపూర్ణ, గంటా లలిత, వరలక్ష్మి, దేవత అరుణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఆర్ఐ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ రథానికి డిప్యూటీ సీఎం పూజలు


తారువలో సత్యసాయి ప్రేమ రథం వద్ద పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి, భక్తులు

దేవరాపల్లి: మండలంలోని తారువకు చేరుకున్న సత్యసాయి బాబా ప్రేమ రథం వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా ప్రేమ రథాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రజలందరికీ బాబా ఆశీస్సులు అందించాలనే సంకల్పంతో సత్యసాయి ప్రేమ రథం ఊరేగింపు కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శంకర్‌రావు, సభ్యులు సూర్యం, రవి శంకర్, రమణమూర్తి, నాయుడు అప్పారావు, జగన్నాథం, కన్నబాబు, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


ముద్దుర్తిలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ముద్దుర్తిలో రెండో రోజు గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరికైనా ఏదైనా కారణాలు అందకపోతే, వాటిని మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రోడ్లను ఏర్పాటు చేయాలని సర్పంచ్ కడిమి వెంకట్ కోరారు. సచివాలయానికి కేటాయించిన గడపగడపకు నిధులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ధర్మశ్రీ సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. ఎంపీపీ గాడి కాసు, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, ఫ్లోర్ లీడర్ పల్లా సంతోష్‌రమణ, జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మలపురెడ్డి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ మలపురెడ్డి దేముడమ్మ, సచివాలయ కన్వీనర్లు మోసూరి శ్రీనివాసరావు, అప్పలస్వామినాయుడు, చిమ్మిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ

లంకవానిపాలెం పాఠశాలలో ఎంఈవోలు తనిఖీ


పాఠశాల విద్యార్థుల చదువులపై అడిగి తెలుసుకుంటున్న సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో -1,2 సత్యనారాయణ, డీపీడీ ప్రసాద్ తెలిపారు. లంకవానిపాలెం ప్రాథమిక పాఠశాలను గురువారం వీరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం రోజూ పెట్టాలని హెచ్ఎంకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటం వల్ల మంచి విద్యా బోధన అందుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలన్నారు.

72 మంది డిగ్రీ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది డిగ్రీ విద్యార్థులు రక్తదానం చేశారు. మరో 55 మందికి రక్త పరీక్షలు చేసి బ్లడ్ గ్రూపులను గుర్తించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, సంజీవని బ్లడ్ బ్యాంక్, విశ్వనాథ్ టైపు ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అన్నారు. రక్తదానం చేయడంలో ఎటువంటి అపోహలకు తావివ్వరాదని సూచించారు. అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం చేయడం పట్ల సమాజాన్ని యువత చైతన్య పరచాలని కోరారు. సీపీడీసీ ప్రెసిడెంట్, రిటైర్డ్ లెక్చరర్ ఎస్.దేముడు మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సీనియర్ లెక్చరర్ ఎస్.ఎం.రఫీయుద్దీన్ రక్తదానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. సంజీవని బ్లడ్‌బ్యాంక్ బాబ్జీ, పవన్, మహేష్, స్వప్న, సుధ, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.లక్ష్మి, బి.పిచ్చమ్మ, ఉపన్యాసకులు జి.వెంకటేష్, లక్ష్మీమంగమ్మ, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.